

చిన్నమ్మి

పి.గోపి

"అమ్మ - ఓ అమ్మగారు" - అని పిలుస్తూఅంత దూరం నుండి పోలయ్య రావడం నా డిస్పెన్సరీ కిటికీ గుండా కనిపించింది. నలభై ఏళ్ళపోలయ్య - నా దగ్గర మూడేళ్ళ నుండి పని చేస్తున్నాడు. పోలయ్య, చిన్నమ్మి - వీళ్ళే నా ఆప్తులు, స్నేహితులు. నేను క్రొత్తగా ప్రాక్టీసు పెట్టుకోవడానికి ఒంటరిగా ఈ చిన్న వూరికి వచ్చినపుడు వీరే నాకు అన్నీ సమకూర్చారు.

వాడు ప్రొద్దునే క్లినిక్‌ని తుడిచి నీళ్ళు తెస్తానని వెళ్ళినవాడు - ఇప్పుడు వస్తుండడం కొంచెం కోపం తెప్పించింది. అసలే చలిగా వుంది - నాలుగు రోజుల నుండి పడుతున్న వర్షం ఇంకా తగ్గలేదు. పల్లెటూరు కావడం వలన రొచ్చు వాసన నన్ను చంపేస్తుంది. పోలయ్య గచ్చు ఎక్కి కిటికీ నుండి — ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నాడు—కొంచెం విసుగ్గా చూశాను. "అమ్మా! చిన్నమ్మి సచ్చిపోయింది" అని వాడు రొప్పుతూ చెప్పివెళ్ళిపోయాడు. ఉలిక్కి పడ్డాను - చిన్నమ్మి చచ్చి పోయిందా ? అది మామూలు విషయం కాదు. ఎందుకంటే చిన్నమ్మికి కేవలం తొంభై ఏడేళ్లు — ఏ ఢోకా లేకుండా ఇంకా పదేళ్ళు బ్రతకగలదని నాకు తెలుసు. చిన్నమ్మికి ఏ జబ్బూ లేదు. అన్ని భాగాలూ సక్రమంగానే పని చేస్తునే వున్నాయి. నేను ఈ వూరికి క్రొత్తగా వచ్చిన రోజుల్లో — పెద్ద తుఫాను వచ్చి చాలా మంది రోగాలు తగిలి చచ్చిపోయారు. అప్పుడు చిన్నమ్మి పాక కూలి పోయి—నాలుగు రోజులు రావి చెట్టుక్రింద వానలో తడుస్తూ నెట్టుకొచ్చి — కనీసం జలుబుకూడా చేయని చిన్నమ్మని చూచి ఆశ్చర్య పోయాను. చిన్నమ్మికి మొగుడు లేడు. చని పోయాడు. చిన్నమ్మికి ఐదుగురు పిల్లల ట - ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయార ట — ఎవరెవరు ఎక్కడ వుంటారో కూడా తెలియదు పాపం! అందుకే చిన్నమ్మి ఒక అనాధని చేర దీసింది. వాడికి ఇప్పుడు ఇరవైరెండేళ్ళు. అల్లరి చిల్లరగా తిరుగుతుంటాడు. వీడికి—చిన్నమ్మికి రోజూ డబ్బుల దగ్గర గొడవ వుండితీరేది. ఈ మధ్యనే వీడు చిన్నమ్మి మీద అలిగి వెళ్ళి పోయాడు. ఇప్పుడు చిన్నమ్మి ఒక్కతే రావి చెట్టుక్రింద గుడిసెలో వుంటుంది. చిన్నమ్మికి డాక్టర్లంటే — తనలాంటి వాళ్ళకి అందు బాటులో వుండరని అభిప్రాయం. కాని నన్ను చూశాక ఈ అభిప్రాయం మార్చుకుంది. నేను ఆ పల్లెటూరికి వచ్చింది ఇలాంటివారికి సహాయం చేద్దామనే. చిన్నమ్మి రోజూ నాదగ్గరకొచ్చి ఏదో సోది చెప్తూనే వుంటుంది. కాని నేనెప్పుడూ కసురుకోలేదు. నేను ఎప్పుడైనా మందులు అవీ కొనడానికి పట్నం పోదామనుకున్నప్పుడల్లా — రాగాలు శోకాలు పెట్టేది. నేను వచ్చేసరికి ఏ రాత్రి అయినా అన్నం కూడా తినకుండా కాచుక్కూర్చునేది. ఆ వూరికి వచ్చిన అందరి డాక్టర్లలాగే నేను వెళ్ళిపోతానని దాని భయం. వూర్లోవారందరికి చిన్నమ్మి రావిచెట్టుచిన్నమ్మి. చిన్నమ్మి తన చిన్నప్పుడు ఆ రావిచెట్టు వేసింద ట. దానికి ఇప్పుడు తొంభైఏళ్ళు — అదీ చిన్నమ్మిలాగే ఆరోగ్యంగా వుంది. చిన్నమ్మికి ఆ చెట్టు అంటే ప్రాణం. ఆ చెట్టు దారికి అడ్డంగా వుందని కొట్టెయ్యడానికి వచ్చినఫారెస్టు వారిని గజగజలాడించి వెనక్కి తిరిగి పంపించేసిందని పోలయ్య నాకు చెప్పాడు. ఆ చెట్టుకు బాడీ గార్డులా తన గేదెని కట్టిపెడ్తుంది. ఆ చెట్టు క్రిందకి పిల్లలు చేరి ఆకులు కోసి పారేస్తుంటారు. చిన్నమ్మి కర్ర తీసుకొని — వాళ్ళవెంట వాళ్ళతోపాటు పరిగెత్తేది. అలాంటి చిన్నమ్మి చనిపోయిందంటే నా మనస్సు అంగీకరించట్లేదు. చిన్నమ్మిని బహుశా నేనే ఆఖరిసారి చూసి వుంటాను. ఎందుకంటే అది రాత్రి పదకొండు వరకు నా దగ్గరేవుంది. నిన్న రాత్రి చిన్నమ్మి తన చిన్ననాటి కోరిక నాకు చెప్పింది. జీవితంలో ఒక్కసారైనా ఫోటో దిగాలని దాని కోరిక. అప్పుడే తీసికెళ్ళమని పట్టుపట్టింది. వద్దంటే చిన్నమ్మి ఏడ్చి , నామీద అలిగి

ఇటీవల విజయవాడలోని విశ్వనాథవారి గృహంలో జరిగిన 'శతాంకుర' కావ్యావిష్కరణ సభలో ఆవిష్కర్త శ్రీ లక్ష్మణయతీంద్రులు, గ్రంథకర్త శ్రీ కోవెల సుప్రసన్నాచార్య

మాట్లాడ్డం మానేస్తుందని అనుభవం బట్టి తెలుసు. అందుకే వర్షంలోనే 'చంద్రా ఫోటో స్టూడియో ' నడిపే చంద్రశేఖర్ దగ్గరకు తీసుకొనివెళ్ళి ఫోటో తీయించి--డబ్బులు కూడా కట్టాను - చంద్రశేఖర్ అంత రాత్రి ఇంట్లో అసలు ఫొటో తీయనన్నాడు. కాని వాడికీ డాక్టర్ అవసరం వుంటుంది కనుక ఒప్పుకున్నాడు - నన్ను చూసి. ఒక వారం రోజుల తర[illegible]త తీసుకుని వెళ్ళమన్నాడు. ఇంక చిన్నమ్మికి ఆ రాత్రి నిద్రపట్టి వుండదని అనుకుంటున్నాను- కాని ఇంతలో ఈ వార్త వింటున్నాను. చిన్నమ్మి ఎలా చనిపోయిందని అడుగుదామనుకునే లోపల - పోలయ్య వెళ్ళిపోయాడు. నేను వున్న ఒక్క పేషెంటును పంపించేసి బయలుదేరాను. చూద్దును గదా ! వర్షం మూలాన రావిచెట్టు విరిగి చిన్నమ్మి పాక మీద పడి -చిన్నమ్మి తలపగిలి చచ్చిపడివుంది. ఆ దృశ్యం చూడలేక పోయాను. రెండు రోజుల తరువాత - వాన తెరిపి యిచ్చాక - వూర్లో వాళ్ళు ఆ చెట్టును నరికి తీసుకుని పోయారు. తరువాత కొన్ని రోజు ల్లోనే నాకు అక్కడ వుండ బుద్ధి వేయక - ఆ వూరు విడిచి వేరే వూరికి వెళ్ళి పోయాను. కాని చిన్నమ్మని నేనెప్పుడూ మర్చిపోలేదు. నా డిస్పెన్సరీలో ఆరోగ్యంగా వుండే పాపల, ఫలానా టానిక్కులు వాడితే ఇలా అవుతారని పహిల్వాన్ ఫొటోలతో పాటు - చిన్నమ్మి ఫొటో కూడా తగిలించాను. నా దగ్గరికొచ్చే పేషెంట్లందరూ చిన్నమ్మి ఫొటో చూసి నవ్వుకుంటుంటారు. కాని తన తొంభై ఏళ్ళజీవి తంలో ఒక్కసారైనా చిన్నమ్మి ఏ వైద్యుడి దగ్గరకు వెళ్ళే అవసరం తెచ్చుకోలేదని వీళ్ళందరికీ ఏం తెలుసు! రెండు నెలల తరవాత - ఆ వూరి మీదుగా నేను బస్సులో వెళుతూ - రోడ్డు మీదనే వుండే చిన్నమ్మి రావి చెట్టును చూశాను - అది అపుడే చిగుర్లు వేస్తూంది. ●